జ్ఞానసంకలనీతంత్రం

(సంస్కృత మూలం - తెలుగు అనువాదం)

అనువాదకులు

పోరంకి దక్షిణామూర్తి

కులకు:
టాగూర్ పబ్లిషింగ్ హౌస్,
నెం. 20, వైశ్య హాస్టల్ బిల్డింగ్,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాదు - 500 027.

జ్ఞానసంకలనీతంత్రం

(సంస్కృత మూలం - తెలుగు అనువాదం)

ప్రియమిత్రులు
ప్రొ। హరి శివకుమార్ గారికి ప్రేమతో
[illegible]
18/06/04

అనువాదకులు

పోరంకి దక్షిణామూర్తి

❖ సౌజన్యం ❖

డా॥ ఆచార్య హరి శివకుమార్

రిటైర్డ్ ప్రొఫెసర్, తెలుగు డిపార్టుమెంట్

కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ప్రతులకు :

టాగూర్ పబ్లిషింగ్ హౌస్,

షాపు నెం. 20, వైశ్య హాస్టల్ బిల్డింగ్,


కాచిగూడ చౌరస్తా, హైదరాబాదు - 500 027.

Jnaana sankalanii tantram
Telugu translation with the original text in Sanskrt

Translated by: **Dr. Poranki Dakshinamurty**

మొదటి కూర్పు : 2001

వెల : రూ. **15/-**



ప్రతులకు :

టాగూర్ పబ్లిషింగ్ హౌస్,

షాపు నం. 20, వైశ్య హాస్టల్ బిల్డింగ్,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాదు - 500 027.
ఫోన్ నం : 7568329

అక్షరాల కూర్పు :

వివేక్ గ్రాఫిక్స్, నల్లకుంట, హైదరాబాదు.

ముద్రణ:

సరస్వతీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, నల్లకుంట,
హైదరాబాదు. ఫోన్ నం : 7612180

శ్రీరామ - శివరామ - కృష్ణలీలల

అనురాగవల్లరికి

తొలిపలుకు

పుష్కరకాలం కిందట నేను అశోక్‌కుమార్ చట్టోపాధ్యాయగారు రచించిన, 'పురాణ పురుష యోగిరాజ శ్రీ శ్యామాచరణ లాహిరీ' అన్న గ్రంథాన్ని తెలుగులోకి అనువదించినప్పుడు, ఆ గ్రంథంలో, 'జ్ఞానసంకలనీతంత్రం' లో నుంచి కొన్ని శ్లోకాలు ఉదాహరించి ఉండటం గమనించాను. ఆ శ్లోకాలు చాలా బాగున్నాయి; యోగసాధకులకు జ్ఞానోద్దీపకాలుగా ఉన్నాయి. అందువల్ల, జ్ఞానసంకలనీతంత్రం మొత్తం చదవాలన్న అభిలాష కలిగింది. అప్పటినుంచి చాలా చోట్ల , ఆ పుస్తకం సంపాదించడానికి ప్రయత్నం చేశాను. ఇటీవలి వరకు లభ్యం కాలేదు.

2000 నవంబరు నెలలో, ఆ గ్రంథం నాకు కాశీలో దొరికింది. ఎంతో పెద్దగా ఉంటుందేమో అనుకున్నాను. తీరా చూస్తే, ఇరవై పుటల పుస్తకం; శ్లోకాలు నూటపది! అందులో విషయం, మహేశ్వరుడు వేదాంతసారాన్ని పార్వతీదేవికి సంగ్రహంగా వివరించడం. నాకు దొరికిన పుస్తకం పేరు 'జ్ఞానసంకులీతంత్రం'; నేను అన్వేషిస్తూ వచ్చినది 'జ్ఞానసంకలనీతంత్రం'. ఇది చాలా ప్రసిద్ధమయిన పేరు. పుస్తకం తిరగేసి చూద్దును కదా - అశోక్‌కుమార్‌గారు ఉదాహరించిన శ్లోకాలన్నీ యథాతథంగా దీంట్లో ఉన్నాయి. అంటే రెండూ ఒకటేనన్నమాట; పేర్లు వేరుగా ఉన్నా!

భారతీయ విద్యాసంస్థాన్‌వారు (జగత్ గంజ్, వారాణసి - 221002) 1993లో మొదటి సారిగా ప్రచురించిన ఈ పుస్తకానికి ఎస్. ఎన్. ఖండేల్‌వాల్‌గారు 'నివేదన్' గా రాసిన పరిచయ వాక్యాల్లో ఈ తంత్రాన్ని గురించి చెప్పిన విషయాలు ఇవి:

- లుప్తప్రాయమయిన శాంభవీతంత్రంలో ఒక భాగం 'జ్ఞానసంకులీతంత్రం'; ఇదయినా పూర్తిగా లభ్యం కాలేదు.
- రాజేంద్రలాల్ మిత్ర రాసిన 'ఉత్పత్తితంత్రం' లో శాంభవీ తంత్రంపేరు

కనిపిస్తుంది.

- షాజహానుకు సమకాలికుడయిన కవీంద్రాచార్య సరస్వతి సేకరించిన గ్రంథాల్లో ఇది ఉండేది.
- బెంగాల్ ఏషియాటిక్ సొసైటీలో దీని రాతప్రతి (గ్రంథసంఖ్య 6035) ఉంది. వంగసాహిత్య పరిషత్తువారి, రాజేంద్రలాల్ మిత్రగారి సూచీపత్రాల్లో దీని పేరు చేర్చి ఉంది.
- గ్రంథం చిన్నదయినప్పటికీ స్వాధ్యాయానికి ఉపాదేయ మనిపిస్తుంది.
- కొన్నేళ్ళకిందట హరిద్వారంలో చండీపర్వత సమీపంలో ఉండే ఒక 'మహాత్ముని' దగ్గర, దక్షిణ భారతదేశపు ఒక భాషాలిపిలో, పేరులేని ఒక రాతప్రతిలో ఈ తంత్రం దొరికింది. ఆ రాతప్రతిలో దాదాపు 700 శ్లోకాలు ఉన్నాయి. వాటికి పరిశిష్టరూపంలో, అదనంగా 110 శ్లోకాలు ఉన్నాయి. ఇవి ప్రచలిత 'జ్ఞానసంకులీ' శ్లోకాలతో కలుస్తున్నాయి. మొదటి 700 శ్లోకాలూ శాంభవీతంత్రం అయి ఉండవచ్చు. దాన్ని బట్టి, 'జ్ఞానసంకులీతంత్రం' శాంభవీతంత్రంలో ఒక భాగం అయి ఉండవచ్చు.
- గ్రంథంలోని భాషాస్వరూపం పాణినికి కూడా పూర్వపుది అనిపిస్తుంది.

మా మిత్రులు మలపాక శివరామకృష్ణగారు (రిటైర్డ్ ప్రొఫెసర్, ఇంగ్లీషు శాఖ, ఉస్మానియా విద్యాలయం) గొప్ప గ్రంథప్రియులు. ఆయన సొంత లైబ్రరీలో కొన్ని వేల గ్రంథాలున్నాయి. తంత్రశాస్త్ర గ్రంథాలు కూడా చాలా ఉన్నాయి. వాటిలో జ్ఞానసంకలనీతంత్రం లేదు! ఆయన శ్రీ రామకృష్ణ పరమహంసభక్తులే కాక తంత్రశాస్త్రాభిమానులు కూడా. అలాంటివారు కొందరు ఎప్పుడూ ఉంటారు. వాళ్ళకోసం ఈ తంత్రపుస్తకాన్ని తెలుగులోకి అనువదించాలనిపించింది. నాకు చేతనైన మేరకు అనువదించి ఈ రూపంలో అందిస్తున్నాను.

తంత్రశాస్త్రాన్ని గురించి కొన్ని అపోహాలూ దురభిప్రాయాలూ

జనంలో ఉన్నాయి; ముఖ్యంగా ఆధునిక శాస్త్రవిషయాలూ వగైరా చద ఫుకున్నవాళ్ళలో. అపోహలకు కారణం, తంత్రశాస్త్రాన్ని గురించి సరిగా తె సుకోడానికి ప్రయత్నించకపోవడం. లోతుకు వెళ్ళి చూస్తే - తంత్రం కానిదేదీ లేదు అనిపిస్తుంది.

'తంత్ర' శబ్దం 'తన్+త్ర' (ష్ట్రన్) నుంచి నిష్పన్నమయిందని చెబుతారు. 'తన్' ధాతువుకు వ్యాప్తిచేయడం, విస్తరింపజేయడం అని, 'త్ర' ప్రత్యయానికి కాపాడటం, రక్షచేయడం అని అర్థాలు ఈ విధంగా, తంత్రశబ్దానికి, "విస్తారపూర్వకంగా కాపాడటం", అని అర్థం ఏర్పడింది. అంటే, తన శాస్త్ర సిద్ధాంతాలను అనుసరించేవాణ్ణి కాపాడేది 'తంత్రశాస్త్రం' అన్నమాట.

తంత్రాలు స్థూలంగా మూడు విధాలు - 1) శివుడు చెప్పినవి (ఆగమాలు), 2) పార్వతి చెప్పినవి (నిగమాలు), 3) ఋషులు చెప్పినవి (ఆర్షతంత్రాలు). మరో విభాగం - 1) శైవ ఆగమాలు 2) శాక్త ఆగమాలు 3) వైష్ణవ ఆగమాలు. ఇంకొక విభాగం - 1) ఆగమం 2) యామలం 3) తంత్రం. ఇలా రకరకాలు. బౌద్ధతంత్రాలు టిబెట్‌లో ఇప్పటికీ నిలిచి ఉన్నాయి.

శాక్తతంత్రాల సంఖ్య 64; దాని ఉపతంత్రాల సంఖ్య 327. శైవతంత్రాల సంఖ్య 32 వీటి ఉపతంత్రాలసంఖ్య 125 'సమ్మోహన తంత్రం' ఆరో అధ్యాయంలో ఈ లెక్కలు ఉన్నట్లుగా 'తంత్రకల్పతరు' అనే హిందీ గ్రంథం, పుట 35 (కల్యాణ్ మందిర్ ప్రకాశన్, అలోపీదేవీ మార్గ్, ప్రయాగ - 211006; ప్రచురణ ఆరో కూర్పు, 1997) తెలుపుతుంది.

తంత్రశాస్త్ర స్వరూపస్వభావాలను గురించి, వాటిలో వైవిధ్యాన్ని గురించి కొందరు ప్రముఖులు రాసిన వ్యాసాలు పైన పేర్కొన్న 'తంత్రకల్పతరు' గ్రంథంలో ఉన్నాయి. వీటినిబట్టి చూస్తే తంత్రాలన్నవి కేవలం వామాచారానికే పరిమితమయినవని అనుకోడం తప్పు అని తెలుస్తుంది. దక్షిణాచార/సమయాచార తంత్రాలు కూడా ఉన్నాయి. పైగా వామాచారమన్నదంతా హేయమయినదీ జుగుప్సాకరమయినదీ అనుకోడం కూడా తప్పు. శక్తికి (వామ) ప్రాధాన్యమిచ్చి చేసే సాధన,

ఆరాధన వామాచారం. ఇందులో, దృఢమయిన మనస్సుగల వీరులూ ధీరులూ మాత్రమే సాధన చెయ్యదగినవి కొన్ని ఉన్నాయన్నది మాత్రం వాస్తవం. అంతమాత్రాన అన్నిటినీ నిరసించవలసిన పని లేదు. శ్రీ రామకృష్ణ పరమహంస అత్యంత కఠోర సాధనలు కూడా సక్రమంగా చేసి సాఫల్యం పొందారన్నది రుజువయింది కదా!

జ్ఞానసంకలనీతంత్రం కేవలం అంతస్సాధనకు సంబంధించిన గ్రంథం. సాధకులకు, జిజ్ఞాసువులకు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశం ఈ విధంగా నెరవేరినందుకు సంతోషం.

మా మిత్రులు డా॥ ముంజులూరి నరసింహారావుగారు దీని రాతప్రతిని నిశితంగా పరిశీలించి కొన్ని మార్పులూ చేర్పులూ సూచించి మెరుగులు దిద్దారు. మూలశ్లోకాల్లో రాతతప్పులు/అచ్చుతప్పులు వ్యాకరణదోషాలు అనిపించినవాటిని 'సాధ్యమయినంతవరకు' సవరించారు. మిత్రధర్మంగా ఆయన శ్రమ తీసుకొని చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

శ్రీరామ - శివరామకృష్ణులది అవినాభావ సంబంధం. ఆప్త మిత్రులు శ్రీపతి (పి.వి. చలపతిరావు) గారి ద్వారా, సుమారు రెండున్నర సంవత్సరాలు కిందట శ్రీరామ్‌గారితో పరిచయం అయింది. అది క్రమంగా దృఢమవుతూ వచ్చింది. అయితే, అందరిలాగే సాధారణ వ్యక్తిగా పైకి కనిపించే శ్రీరామ్‌గారి సమగ్ర స్వరూపస్వభావాలను అర్థంచేసుకొని చెప్పగలవారు 'మ' వంటివారు మాత్రమే. నేనెంతటివాణ్ణి! ఆత్మీయులు శ్రీరామ - శివరామకృష్ణులిద్దరికీ ఏకకాలంలోనే 'నూతన సంవత్సర-నూతన శతాబ్ది - నూతన సహస్రాబ్ది' సంయుక్త శుభాకాంక్షలు తెలిపే అవకాశం నాకు ఇదొక్కటే. దీన్ని పురస్కరించుకొని ఈ పుస్తకాన్ని ఆనందంగా వారికి అంకితమిచ్చాను.

31 డిసెంబరు 2000 **పోరంకి దక్షిణామూర్తి**

జ్ఞానసంకలనీతంత్రం

1. కైలాసశిఖరాసీనం దేవదేవ జగద్గురుమ్,
పృచ్ఛతి స్మ మహాదేవీ బ్రూహి జ్ఞానం మహేశ్వర.

కైలాసగిరి శిఖరంమీద కూర్చుని ఉన్న దేవాధిదేవుడయిన మహేశ్వరుణ్ణి మహాదేవి పార్వతీదేవి అడిగింది - మహేశ్వరా! దేన్ని జ్ఞానమంటారు?' అని.

దేవ్యువాచ

2. కుతః సృష్టి ర్భవేద్దేవ కథం సృష్టిర్వినశ్యతి,
బ్రహ్మజ్ఞానం కథం దేవ సృష్టిసంహారవర్జితమ్.

దేవి ఇంకా ఏమడిగిందంటే, 'దేవా! విశ్వసృష్టి ఎక్కణ్ణించి జరుగుతుంది? ఈ సృష్టికి వినాశం ఎలా జరుగుతుంది? సృష్టిసంహారాలేవీ లేని బ్రహ్మజ్ఞానాన్ని గురించి చెప్పండి', అని.

ఈశ్వర ఉవాచ

3. అవ్యక్తాచ్చ భవేత్ సృష్టి రవ్యక్తాచ్చ వినశ్యతి
అవ్యక్తం బ్రహ్మణో జ్ఞానం సృష్టిసంహారవర్జితమ్.

ఈశ్వరుడు ఇలా చెప్పాడు ఈ సృష్టి అవ్యక్తంలోనుంచి జరుగుతుంది.. నాశనమయి అవ్యక్తంలోకే పోతుంది. అవ్యక్తమే సృష్టిసంహారాలు లేని బ్రహ్మజ్ఞానం.

4. ఓంకారాదక్షరాత్ సర్వాత్త్వేతా విద్యాశ్చతుర్దశ,
మంత్ర పూజా తపో ధ్యానం కర్మాకర్మ తథైవ చ.

ఓంకారంనుంచే 14 విద్యలు, మంత్రం, పూజ, తపస్సు, ధ్యానం, కర్మ, అకర్మ అన్నవి పుట్టాయి

5. షడంగ వేదచత్వారి మీమాంసా న్యాయవిస్తరః,
ధర్మశాస్త్రపురాణాది ఏతా విద్యాశ్చతుర్దశ.

నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, మీమాంస, న్యాయం, ధర్మశాస్త్రం, పురాణం అన్న పద్నాలుగు విద్యలూ పుట్టాయి.

6. తావద్విజో భవేత్ సర్వే యావద్ జ్ఞానం న జాయతే,
బ్రహ్మజ్ఞానపదం జ్ఞాత్వా సర్వవిద్యా స్థిరా భవేత్

ఈ పద్నాలుగు విద్యల జ్ఞానం లేనంతవరకు ద్విజుడుగానే ఉంటాడు బ్రహ్మజ్ఞానం కలగ్గానే సమస్త విద్యలూ స్థిరమవుతాయి.

7 వేదశాస్త్ర పురాణాని సామాన్యగణికా ఇవ,
యా పునః శాంభవీవిద్యా గుప్తా కులవధూరివ

వేదాలు, శాస్త్రాలు, పురాణాలు వంటివన్నీ సామాన్యవేశ్యవంటివి (అంటే, ఎక్కడ కావాలంటే అక్కడ దొరుకుతాయి). కాని శాంభవీవిద్య ఇల్లాలి వంటిది (ఇంటోనే మరుగున ఉంటుంది)

8. దేహస్థాః సర్వవిద్యాశ్చ దేహస్థాః సర్వదేవతాః,
దేహస్థాః సర్వతీర్థాని గురువాక్యేన లభ్యతే

మన శరీరంలోనే అన్ని విద్యలూ ఉన్నాయి శరీరంలోనే అందరు

దేవతలూ ఉన్నారు.. శరీరంలోనే అన్ని తీర్థాలు ఉన్నాయి. గురువాక్యం (శ్రద్ధ) వల్ల ఇవన్నీ అందుతాయి

9. అధ్యాత్మ విద్యా హి నృణాం సౌఖ్య మోక్షకరీ భవేత్
ధర్మకర్మ తథా జప్య మేతత్ సర్వం నివర్తతే

మనుష్యులకు అధ్యాత్మ విద్యే సౌఖ్యాన్నీ మోక్షాన్నీ ఇస్తుంది. సమస్త ధర్మాలూ కర్మలూ జపతపాలూ అన్నీ ఈ అధ్యాత్మ విద్యలోనే కలిసిపోతాయి. (ఎలాగంటే -)

10. కాష్ఠమధ్యే యథా వహ్నిః పుష్పే గంధః పయోఽమృతమ్,
దేహమధ్యే తథా దేవః పుణ్యపాపవివర్జితః.

కట్టెలో నిప్పు, పువ్వులో వాసన నీటిలో అమృతం ఉంటున్నట్లుగానే, శరీరంలో పుణ్యపాపాలు ఏవీ లేని దేవుడు ఉన్నాడు

11. ఇడా భగవతీ గంగా పింగళా యమునానదీ
ఇడాపింగళయోర్మధ్యే సుషుమ్నా చ సరస్వతీ.

మన శరీరంలో ఉండే ఇడానాడీ (ఎడమవైపుది) గంగానది. పింగళానాడి (కుడివైపుది) యమునానదీ ఈ ఇడాపింగళానాడులకు మధ్యన ఉండే సుషుమ్నానాడి సరస్వతీనది

12 త్రివేణీసంగమో యత్ర తీర్థరాజః స ఉచ్యతే,
తత స్నానం ప్రకుర్వీత సర్వపాపైః ప్రముచ్యతే

ఈ మూడూ కలిసే చోటే తీర్థాలన్నిటిల్లోకీ శ్రేష్ఠమయిన త్రివేణీసంగమం అంటారు అక్కడ స్నానం చేసే పాపాలన్నీ నశించిపోతాయి.

దేవ్యువాచ

13. కీదృశీ ఖేచరీముద్రా విద్యా చ శాంభవీ పునః,
కీదృశ్యధ్యాత్మవిద్యా చ తన్మే బ్రూహి మహేశ్వర.

దేవి అడిగింది - ఓ మహేశ్వరా! ఖేచరీముద్ర ఎలాటిది? దేన్ని శాంభవీవిద్య అంటారు. అధ్యాత్మవిద్య ఏ విధంగా ఉంటుంది? ఇవి నాకు చెప్పండి.

ఈశ్వర ఉవాచ

14. మనః స్థిరం యస్య వినావలంబనమ్
వాయుః స్థిరో యస్య వినా నిరోధనమ్,
దృష్టిః స్థిరా యస్య వినావలోకనమ్
సా ఏవ ముద్రా విచరంతి ఖేచరీ.

ఈశ్వరుడు చెప్పాడు - దేనివల్ల మనస్సుకు ఏ ఆలోచనా చొరబడకుండా నిలకడ వస్తుందో, దేనివల్ల గాలికి (కుంభకాదులవల్ల) ఆపుదల లేకుండా నిలకడ ఏర్పడుతుందో, దేనివల్ల చూపు (బాహ్యమయిన త్రాటకాది ప్రక్రియాసాధనలు లేకుండా) చూడకుండానే నిలకడ పొందుతుందో దాన్నే ఖేచరీముద్ర అంటారు.

15. బాలస్య మూర్ఖస్య యథైవ చేతః స్వప్నేన హీనోఽపి కరోతి నిద్రామ్,
తతో గతః పథో నిరావలంబః సా ఏవ విద్యా విచరంతి శాంభవీ.

అజ్ఞుడి లేదా మూర్ఖుడి మనస్సు స్వప్నావస్థ లేకుండా నిద్రలో లీనమయినట్లు, ఏ విద్యను ఆశ్రయించిన మీదట మనస్సు, మెలకువలోనే

ఏ ఆధారమూ లేకుండా లీనమయి ఉంటుందో అదే శాంభవీవిద్య.

దేవ్యువాచ

16. దేవదేవ జగన్నాథ బ్రూహి మే పరమేశ్వర,
దర్శనాని కథం దేవ భవంతి చ పృథక్ పృథక్.

దేవి ఇలా అడిగింది - ఓ దేవదేవా! జగన్నాథా! పరమేశ్వరా! దర్శనాలు వేరువేరుగా ఎందుకున్నాయో చెప్పండి.

ఈశ్వర ఉవాచ

17. త్రిదండీ చ భవేద్భక్తో వేదాభ్యాసరత: సదా,
ప్రకృతివాదరతా: శాక్తా బౌద్ధా: శూన్యాతివాదిన:.

ఈశ్వరుడు ఇలా చెప్పాడు - త్రిదండిస్వాములు దైవభక్తులు. ఎప్పుడూ వేదాభ్యాసంలో మునిగి ఉంటారు. (శక్తిని ఆరాధించే) శాక్తులు ప్రకృతివాదరతులు. బౌద్ధులు శూన్యవాదులు.

18. అత ఊర్ధ్వగామినో యే వా తత్త్వజ్ఞా అపి తాదృశా:,
సర్వం నాస్తీతి చార్వాకా జల్పంతి విషయాశ్రితా:.

(త్రిదండులకు, శాక్తులకు, బౌద్ధులకు అతీతంగా) పైకి వెళ్ళేవాళ్ళే అసలయిన తత్త్వజ్ఞులు. విషయాశ్రయులయిన చార్వాకమతవాదులే ఈశ్వరుడి ఉనికిని అంగీకరించరు.

19. ఉమా పృచ్ఛతి హే దేవ! పిండ బ్రహ్మాండ లక్షణమ్,
పంచభూతం కథం దేవ! గుణా: కే పంచవింశతి:

ఉమాదెవి ఇలా అడుగుతోంది — ఓ దేవా! పిండ బ్రహ్మాండ పంచభూత లక్షణం ఏమిటి? 25 గుణాలు ఏవి?

ఈశ్వర ఉవాచ

20. అస్థి మాంసం నఖం చైవ త్వగ్రోమాని చ పంచమమ్
పృథ్వీ పంచగుణా: ప్రోక్తా బ్రహ్మజ్ఞానేన భాషతే.
21. శుక్ర శోణిత మజ్జా చ మల మూత్రం చ పంచమమ్,
అపాం పంచగుణా: ప్రోక్తా బ్రహ్మజ్ఞానేన భాషతే.
22. నిద్రా క్షుదా తృషా చైవ క్లాంతి రాలస్యం పంచమమ్,
తేజ: పంచగుణా: ప్రోకా బ్రహ్మజ్ఞానేన బాషతే
23. ధారణం చాలనం క్షేపం సంకోచం ప్రసరస్తథా,
వాయో: పంచగుణా: ప్రోక్తా బ్రహ్మజ్ఞానేన భాషతే.
24. కామం క్రోధం తథా మోహం లజ్జా లోభం చ పంచమమ్,
నభ: పంచగుణా: ప్రోక్తా బ్రహ్మజ్ఞానేన భాషతే.

ఈశ్వరుడు ఇలా చెబుతున్నాడు – ఎముక, మాంసం, గోరు, చర్మం, వెంట్రుక పృథ్వీతత్త్వం తాలూకు గుణాలు. శుక్రం, శోణితం, మజ్జ, మలం, మూత్రం జలతత్త్వగుణాలు. నిద్ర, ఆకలి, దప్పిక, బడలిక, సోమరితనం తేజస్తత్త్వగుణాలు. ధారణం, చాలనం, క్షేపణం, సంకోచం, ప్రసారణం వాయుతత్త్వగుణాలు. కామం, క్రోధం, లోభం, మోహం, లజ్జ ఆకాశతత్త్వగుణాలు (20-24).

25. ఆకాశాజ్జాయతే వాయు ర్వాయోరుత్పద్యతే రవి:,
రవే రుత్పద్యతే తోయం తోయాదుత్పద్యతే మహీ.

ఆకాశంనుంచి వాయువు (గ్యాస్), వాయువునుంచి అగ్ని (రవి), అగ్నినుంచి జలం, జలంనుంచి భూమి పుడతాయి

26. మహీ విలీయతే తోయే తోయం విలీయతే రవౌ,
రవిర్విలీయతే వాయౌ వాయుర్విలీయతే ఖే

భూమి జలంలో లయమవుతుంది, జలం అగ్నిలో లయమవుతుంది అగ్ని వాయువులోను వాయువు ఆకాశంలోను లయమవుతాయి

27. పంచతత్త్వాద్ భవేత్ సృష్టి స్తత్త్వాత్ తత్త్వే విలీయతే,
పంచతత్త్వాద్ పరం తత్త్వం, తత్త్వాతీతం నిరంజనమ్.

పంచతత్త్వాలతో సృష్టి జరుగుతుంది. తత్త్వంలో తత్త్వం విలీనమవుతుంది పరమాత్మతత్త్వం నిరంజనమయినది; సృష్టికి మూలమయిన పంచతత్త్వాలను మించినది. ఈ తత్త్వాతీతజ్ఞానంతో పరమాత్మలో లీనమవడం జరుగుతుంది.

28. స్పర్శనం రసనం చైవ ఘ్రాణం చక్షుశ్చ శ్రోత్రమ్
పంచేంద్రియ మిదం తత్త్వం మన: సాధన్య మింద్రియమ్.

తాకడం, రుచి చూడటం, వాసన చూడటం, కంటితో చూడటం, వినడం అన్నవి ఐదూ ఐదు ఇంద్రియాల తత్త్వాలు. మనస్సే అన్ని ఇంద్రియాలకూ కారణం.

29. బ్రహ్మాండలక్షణం సర్వం దేహమధ్యే వ్యవస్థితమ్,
సాకారాశ్చ వినశ్యంతి నిరాకారో న నశ్యతి

బ్రహ్మాండం తాలూకు లక్షణాలన్నీ శరీరంలో ఉన్నాయి. వీటిలో సాకారమయినవి (రూపమున్నవి) నశించిపోతాయి. కాని నిరాకారమయినది నశించదు.

30. నిరాకారం మనో యస్య నిరాకారసమో భవేత్,
తస్మాత్ సర్వప్రయత్నేన సాకారంతు పరిత్యజేత్.

ఎవరి మనస్సు నిరాకారమయిపోతుందో (దేన్నీ మనస్సులోకి చొరబడనియ్యకుండా ఉంటుందో) అతడు నిరాకారుడితో సమానంగా అవినాశి అవుతాడు. అందుకని ఎంత కష్టపడి అయినా సరే, సాకారాన్ని (అంటే నామరూప ప్రపంచాన్ని) విడిచిపెట్టాలి.

దేవ్యువాచ

31. ఆదినాథ మయి బ్రూహి సప్తధాతుః కథం భవేత్,
ఆత్మా చైవాంతరాత్మా చ పరమాత్మా కథం భవేత్.

దేవి అన్నది - ఓ ఆదినాథా! సప్తధాతువుల రూపమేమిటి? ఆత్మ అంతరాత్మ, పరమాత్మ అన్నవి ఏమిటి? నాకు చెప్పండి.

ఈశ్వర ఉవాచ

32. శుక్ర శోణిత మజ్జా చ మేదో మాంసం చ పంచమమ్,
అస్థి త్వక్ చైవ సప్తైతే శరీరేషు వ్యవస్థితాః.

ఈశ్వరుడు అన్నాడు - శుక్రం, శోణితం (రక్తం), మజ్జ, కొవ్వు, మాంసం, అన్న ఐదిటితోపాటు, ఎముక, చర్మంకూడా కలిసి మొత్తం ఏడు ధాతువులు దేహంలో ఉంటాయి.

33. శరీరం చైవ మాత్మాన మంతరాత్మా మనో భవేత్,
పరమాత్మా భవే, చ్ఛూన్యంమనో యత్ర విలీయతే.

దేహాన్ని ఆత్మ (తాను) అనీ మనస్సును అంతరాత్మ అనీ సంకల్ప వికల్పశూన్యమయిన మనస్సు, వాసనాశూన్యమయిన మనస్సు, ఎక్కడ విలీనమవుతుందో అదే పరమాత్మ అనీ అంటారు.

34. రక్తధాతుర్భవేన్మాతా శుక్రధాతుర్భవేత్ పితా,
శూన్యధాతుర్భవేత్ ప్రాణో గర్భపిండం ప్రజాయతే.

రక్తధాతువు తల్లి. శుక్రధాతువు తండ్రి. శూన్యధాతువు ప్రాణం. ఈ మూడింటి కలయికతో గర్భపిండం ఏర్పడుతుంది.

దేవ్యువాచ

35. కథముత్పద్యతే వాచా కథం వాచా విలీయతే,
వాక్యస్య నిర్ణయం బ్రూహి పశ్య జ్ఞానముదాహర.

దేవి అంటున్నది - వాక్కువల్ల జ్ఞానం ఎలా పుడుతుంది? పరోక్ష జ్ఞానం ఏ వాక్కులో విలీనమవుతుంది?

ఈశ్వర ఉవాచ

36. అవ్యక్తా జ్జాయతే ప్రాణః ప్రాణాదుత్పద్యతే మనః,
మనసోత్పద్యతే వాచో మనసా వాగ్విలీయతే.

ఈశ్వరుడు అంటున్నాడు - జ్ఞానరూపమయిన అవ్యక్తంలోంచి ప్రాణం పుడుతుంది. ఆ ప్రాణంలోంచి మనస్సు పుడుతుంది. మనస్సులోంచి వాక్కు పుడుతుంది. చివరికి ఆ వాక్కు మనస్సులో లయమవుతుంది.

దేవ్యువాచ

37. కస్మిన్ స్థానే వసేత్ సూర్యః, కస్మిన్ స్థానే వసేచ్ఛశీ,
కస్మిన్ స్థానే వసేద్ వాయుః, కస్మిన్ స్థానే వసేన్మనః.

దేవి అడుగుతోంది - సూర్యుడు ఎక్కడ ఉంటాడు? చంద్రుడు ఎక్కడ ఉంటాడు? వాయువు ఎక్కడ ఉంటుంది? మనస్సు ఎక్కడ ఉంటుంది?

ఈశ్వర ఉవాచ

38. తాలుమూలే స్థితశ్చంద్రో నాభిమూలే దివాకరః,
సూర్యాగ్రే వాయు శ్చంద్రాగ్రే వసతే మనః.

ఈశ్వరుడు చెబుతున్నాడు - అంగిట్లో (తాలుమూలంలో) చంద్రుడుంటాడు. బొడ్డులో సూర్యుడుంటాడు. వాయువు ఉండేది సూర్యుడికి పైన. మనస్సు ఉండేది చంద్రుడికి పైన.

39. సూర్యాగ్రే వసతే చిత్తం చంద్రాగ్రే జీవితం ప్రియే,
ఏతద్వ్యక్తం మహాదేవి గురువాక్యేన లభ్యతే.

సూర్యుడికి పైభాగంలో చిత్తమూ చంద్రుడికి పైభాగంలో ప్రాణమూ ఉంటాయి. గురూపదేశం ద్వారానే ఇది (వీటి జ్ఞానం) లభిస్తుంది మహాదేవీ!

దేవ్యువాచ

40. కస్మిన్ స్థానే వసేచ్ఛక్తిః, కస్మిన్ స్థానే వసేచ్ఛివః
కస్మిన్ స్థానే వసేత్ కాలో, జరా కేన ప్రజాయతే.

దేవి అన్నది - శక్తి ఉండేది ఎక్కడ? శివుడు ఉండేది ఎక్కడ? కాలం ఉండేది ఎక్కడ? ముసలితనం దేనివల్ల వస్తుంది?

ఈశ్వర ఉవాచ

41. పాతాళే వసతే శక్తి ర్బహ్మాండే వసేత్ శివః,
అంతరిక్షే వసేత్ కాలో జరా తేన ప్రజాయతే.

శివుడు అన్నాడు - శక్తి పాతాళంలో ఉంటుంది. బ్రహ్మాండం శివుడి నివాసం. అంతరిక్షం కాలుడి వాసం. కాలుడివల్లే ముసలితనం వస్తుంది.

దేవ్యువాచ

42. ఆహారం కాంక్షతే కోzసౌ భుంజతే పిబతే కథమ్,
జాగ్రత్స్వప్నసుషుప్తౌ చ కోవాzసౌ భుంజతే ప్రతిబుధ్యతే.

దేవి అడిగింది - ఆహారాన్ని కోరేవారు ఎవరు? తినేవారూ తాగేవారూ ఎవరు? జాగ్రత్, స్వప్న, సుషుప్తులలో మెలకువగా ఉండేవారు ఎవరు?

ఈశ్వర ఉవాచ

43. ఆహారం కాంక్షతే ప్రాణో భుంజతేzపి హుతాశనః,
జాగ్రత్స్వప్నసుషుప్తౌ చ వాయుశ్చ ప్రతిబుధ్యతే.

ఈశ్వరుడు ఇలా చెప్పాడు - ప్రాణాలకు ఆహారంకోసం కోరిక పుడుతుంది. హుతాశనుడు (అగ్నిదేవుడు/జఠరాగ్ని) భోజనం చేస్తాడు. జాగ్రత్స్వప్నసుషుప్తుల్లో వాయువు మెలకువగా ఉంటుంది.

దేవ్యువాచ

44. కో వా కరోతి కర్మాణి కో వా లిప్యతే పాతకైః,
కో వా కరోతి పాపాని కో వా పాపైః ప్రముచ్యతే.

దేవి అడుగుతోంది - కర్మలు చేసేది ఎవరు? పాతకాలు అంటేది ఎవరికి? పాపాలు చేసేది ఎవరు? పాపవిముక్తి పొందేది ఎవరు?

శివ ఉవాచ

45. మనః కరోతి పాపాని మనో లిప్యతే పాతకైః,
మనశ్చ తన్మయం భూత్వా న పుణ్యై ర్న చ పాతకైః.

శివుడు చెబుతున్నాడు - పాపాలు చేసేది మనస్సు. మనస్సుకే పాపాలు అంటుతాయి. పుణ్యపాపాలు అంటకుండా ఉన్నప్పుడు అది తన్మయం (తత్+మయం=బ్రహ్మమయం) అవుతుంది. అప్పుడది ఈ రెంటికీ అతీతమవుతుంది.

దేవ్యువాచ

46. జీవః కేన ప్రకారేణ శివో భవతి కస్య చ,
కార్యస్య కారణం బ్రూహి కథం కించ ప్రసాదనమ్.

దేవి అంటున్నది - జీవుడు ఏ ప్రకారంగా శివత్వం పొందుతాడు? ఏ కార్యానికి కారణం, తుష్టి సాధనం ముఖ్యమయినదో తెలపండి.

శివ ఉవాచ

47. భ్రాంతిబద్ధో భవేజ్జీవో భ్రాంతిముక్తః సదాశివః,
కార్యే హి కారణం త్వంచ పునర్పృథో విశిష్యతే.

శివుడు చెబుతున్నాడు - జీవుడు భ్రాంతిచేత కట్టుబడిపోయి ఉంటాడు. భ్రాంతి తొలగినవాణ్ణే సదాశివుడు అంటారు. నువ్వే కార్యమూ కారణమూ. ఇది తెలుసుకోడమే శ్రేష్ఠకార్యం.

48. మనోఽన్యత్ర శివోఽన్యత్ర శక్తిరన్యత్ర మారుతః,
ఇదం తీర్థ మిదం తీర్థం భ్రమంతి తామసా జనాః.

49. ఆత్మతీర్థం న జానాతి కథం మోక్షో వరాననే.

మనస్సు ఒకచోట. శివశక్తులు వేరే వేరే చోట్ల. ప్రాణం మరొక చోట. - ఈ విధంగా తమోబుద్ధికి లోబడి పామరజనులు, ఈ తీర్థానికనీ ఆ తీర్థానికనీ తిరుగుతూ ఉంటారు. ఆత్మతీర్థం తెలియనివాళ్ళకు మోక్షం ఎలా వస్తుంది?

50. న వేదం వేదమిత్యాహు ర్వేదా దాబ్రహ్మ సనాతనమ్,
బ్రహ్మవిద్యారతో యస్తు స విప్రో వేదపారగః.

కేవల వేదాధ్యయనంవల్ల వేదప్రతిపాదితమయిన బ్రహ్మజ్ఞానం లభించదు. సనాతన బ్రహ్మజ్ఞాన పర్యంతం బ్రహ్మజ్ఞానరతుడయి ఉంటే వేదపారగుడు అవుతాడు.

51. మథిత్వా చతురో వేదాన్ సర్వ శాస్త్రాణి చైవ హి,
సారంతు యోగిభిః పీతం, తక్రం పిబంత పండితాః.

నాలుగు వేదాలనూ సర్వశాస్త్రాలనూ మధించి వాటి సారాన్ని (బ్రహ్మానందామృతాన్ని) తాగుతారు యోగులు. (వెన్న తీయగా మిగిలిన) మజ్జిగ తాగుతారు పండితులు.

52. ఉచ్ఛిష్టం సర్వశాస్త్రాణి సర్వవిద్యా ముఖే ముఖే,
నోచ్ఛిష్టం బ్రహ్మణో జ్ఞాన మవ్యక్తం చేతనామయమ్.

శాస్త్రం ఉపదేశించే పరోక్ష జ్ఞానాన్ని గురుశిష్యపరంపరగా వాగ్రూపంలో అందించడం జరుతూ ఉంటుంది. అపరోక్ష జ్ఞానం మాత్రం స్వానుభవైక వేద్యమయినది.

53. న తపస్తప ఇత్యాహు ర్బ్రహ్మచర్యం తపోత్తమమ్,
ఊర్ధ్వరేతా భవేద్ యస్తు స దేవో న తు మానుషః.

తపస్సులన్నిటిలోకీ ఉత్తమమయినది బ్రహ్మచర్యం. ఊర్ధ్వ రేతస్కులయి బ్రహ్మచర్యాన్ని పాటించేవారు మనుష్యులు కారు, దేవతలు.

54. న ధ్యానం ధ్యానమిత్యాహు ర్ధ్యానం శూన్యగతం మనః,
తస్య ధ్యాన ప్రసాదేన సౌఖ్యం మోక్షం న సంశయః.

సాకారమయిన రూపాదులను ధ్యానించడం ధ్యానం కాదు. శూన్య (నిరాకార బ్రహ్మ) ధ్యానమే యథార్థమయిన ధ్యానం (మొదట్లో, మనస్సు నిలవడానికి సాకారధ్యానం ఉపయోగకరమయినప్పటికీ క్రమక్రమంగా ఆ దశను దాటి నిరాకార బ్రహ్మ ధ్యానానికి పూనుకోవాలి). దీనివల్ల భ్రమకూడా శూన్యగతం అయిపోతుంది. ఈ ధ్యానప్రసాదంవల్ల సుఖమూ ముక్తీ రెండూ కలుగుతాయి.

55. న హోమం హోమమిత్యాహుః సమాధౌ తత్తు హూయతే,
బ్రహ్మాగ్నౌ హూయతే ప్రాణం హోమకర్మ తదుచ్యతే.

కేవలం అగ్నిహోత్రంలో (నెయ్యీ సమిధలూ వగైరాలతో) చేసే ఆహుతి ఒక్కటే హోమం కాదు. బ్రహ్మజ్ఞానమనే అగ్నిలో ప్రాణమనే నేతిని ఆహుతి చెయ్యడమే వాస్తవికమయిన హోమం అవుతుంది.

56. పాపకర్మ భవేద్భవ్యం పుణ్యం చైవ ప్రవర్తతే,
తస్మాత్ సర్వప్రయత్నేన తద్ద్వయంచ త్యజేద్బుధః.

పాపపుణ్యాలు రెండూ రాబోయే కాలంలో వాటి వాటి ఫలితాల్ని తప్పకుండా ఇస్తాయి. కనక, సర్వప్రయత్నంతోనూ ఈ పాపపుణ్యాలను రెండిటినీ విడిచిపెట్టాలి.

57. యావద్వర్ణం కులం సర్వం తావద్ జ్ఞానం న జాయతే,
బ్రహ్మజ్ఞానపదం జ్ఞాత్వా సర్వవర్ణవివర్జితః.

జ్ఞానం కలిగేటంతవరకు వర్ణభేదాదులు ఉంటూనే ఉంటాయి. బ్రహ్మజ్ఞానం కలిగినమీదట వర్ణ, కుల భేదాలు తొలగిపోతాయి.

దేవ్యువాచ

58. యత్త్వయా కథితం జ్ఞానం నాహం జానామి శంకర,
నిశ్చయం బ్రూహి దేవేశ మనో యత్ర విలీయతే.

దేవి అంటున్నది - ఓ శంకరా! మీరు చెప్పిన జ్ఞానం నాకు ఒంటబట్టలేదు. ఓ దేవేశా! మనస్సు ఎక్కడ లయమవుతుందో, ఏ ప్రకారంగా లయమవుతుందో నిశ్చయంగా చెప్పండి.

ఈశ్వర ఉవాచ

59. మనో వాక్యం తథా కర్మ తృతీయం యత్ర లీయతే
వినా స్వప్నం యథా నిద్రా బ్రహ్మజ్ఞానం తదుచ్యతే

ఈశ్వరుడు ఇలా అంటున్నాడు - మనస్సు, వాక్కు, కర్మ లయంపొందినచోట, కలలురాని నిద్ర మాదిరి అవలంబనరహిత స్థితితో ఉదయించే జ్ఞానమే బ్రహ్మజ్ఞానం.

60. ఏకాకీ నిస్పృహః శాంత శ్చింతా నిద్రావివర్జితః,
బాలభావ స్తథా భావో బ్రహ్మజ్ఞానం తదుచ్యతే.

ఒంటరిగాను, కోరికలు లేకుండాను, శాంతంగాను, నిశ్చింతగాను, నిద్రారహిత స్థితిలోను చిన్నపిల్లవాడి మాదిరి స్థితిలోను ఉండటాన్ని బ్రహ్మజ్ఞానం అంటారు.

61. శ్లోకార్థంతు ప్రవక్ష్యామి యదుక్తం తత్త్వదర్శిభిః,
సర్వచింతాపరిత్యాగో నిశ్చింతో యోగ ఉచ్యతే.

తత్త్వదర్శులయిన పండితులు చెప్పేదాన్ని శ్లోకంలో అర్ధభాగంలో చెబుతాను. అన్ని చింత (ఆలోచన)లనూ విడిచిపెట్టి నిశ్చింతుడు కావడాన్నే యోగం అంటారు.

62. నిమిషం నిమిషార్థం వా సమాధి మధిగచ్ఛతి,
శతజన్మార్జితం పాపం తత్క్షణాదేవ నశ్యతి.

ఒక్క క్షణకాలమయినా, అర్ధక్షణ కాలమయినా సరే సమాధి స్థితి పొందినట్లయితే కొన్ని వందల జన్మల పాపాలు భస్మమయిపోతాయి.

దేవ్యువాచ

63. కస్య నామ భవేచ్ఛక్తిః కస్య నామ భవేచ్ఛివః,
ఏతన్మే బ్రూహి భో దేవ, పశ్చాత్ జ్ఞానం ప్రకాశయ.

దేవి అంటున్నది - ఓ దేవా! శక్తి అన్నది ఎవరి పేరు? శివుడన్నది ఎవరి పేరు? ఈ సంగతి ముందుగా చెప్పి తరవాత జ్ఞానోపదేశం చెయ్యండి.

ఈశ్వర ఉవాచ

64. చలచ్చిత్తే వసేచ్ఛక్తిః స్థిరచిత్తే వసేచ్ఛివః,
స్థిరచిత్తే భవేద్ దేవి సదేహస్థోఽపి సిద్ధ్యతి.

ఈశ్వరుడు అంటున్నాడు - దేవీ! శక్తి చంచల చిత్తంలో ఉంటుంది. స్థిరచిత్తంలో శివుడుంటాడు. నువ్వు స్థిరచిత్తురాలివి అవు. క్రమక్రమంగా సిద్ధి కలుగుతుంది.

65. కస్మిన్ స్థానే త్రిధాశక్తిః షట్చక్రం చ తథైవ చ
ఏకవింశతి బ్రహ్మాండం సప్తపాతాళ మేవ చ.

దేవి అన్నది - మూడు రకాలయిన శక్తి, ఆరు చక్రాలు ఎక్కడున్నాయి? 21 బ్రహ్మాండం, 7 పాతాళాలు ఎక్కడున్నాయి?

ఈశ్వర ఉవాచ

66. ఊర్ధ్వశక్తి ర్భవేత్ కంఠః అధఃశక్తి ర్భవేద్ గుదః,
మధ్యశక్తి ర్భవేన్నాభిః శక్త్యాతీతం నిరంజనమ్.

ఈశ్వరుడన్నాడు - కంఠంలో ఊర్ధ్వశక్తి ఉంది. బొడ్డులో మధ్యశక్తి

ఉంటుంది. ఈ మూడు రకాల శక్తులకూ అతీతంగా నిరంజనుడయిన బ్రహ్మ ఉంటాడు.

67. ఆధారం గుహ్యచక్రంతు స్వాధిష్ఠానం చ లింగకమ్,
చక్రభేదం మయా ఖ్యాతం చక్రాతీత! నమో నమః.

మూలాధారచక్రం గుహ్య ప్రదేశం (గుదస్థానం)లో ఉంటుంది. (ఆపైన) లింగమూల ప్రదేశంలో ఉంటుంది స్వాధిష్ఠానచక్రం. చక్రాలన్నిటికీ అతీతమయినదానికి (నిరంజన బ్రహ్మకు) నమస్కారం

68. కాయోర్ధ్వం చ బ్రహ్మలోకః స్వాధః పాతాళమేవ చ,
ఊర్ధ్వ మూల మధః శాఖం వృక్షాకారం కళేబరమ్

లలాటానికి పైభాగాన్ని బ్రహ్మలోకం అంటారు. క్రింది భాగాన్ని పాతాళమంటారు. ఊర్ధ్వభాగం మూలం అధోభాగం శాఖోపశాఖలుగా విస్తరించినది. ఈ ప్రకారంగా జీవుడి శరీరం వృక్షాకారమున్నది.

దేవ్యువాచ

69. శివ శంకర ఈశాన బ్రూహి మే పరమేశ్వర,
దశవాయుః కథం దేవ దశద్వారాదీ చైవ హి.

దేవి అడుగుతోంది - శివా! శంకరా! ఈశాన! పరమేశ్వర! దేహంలో పది వాయువులు ఎలా ఉంటాయి? పన్నెండు ద్వారాలు ఏవి?

ఈశ్వర ఉవాచ

70. హృది ప్రాణః స్థితో వాయు రపానో గుదసంస్థితః,
సమానో నాభిదేశే తు ఉదానః కంఠమాశ్రితః.

71 వ్యానః సర్వగతో దేహే సర్వగాత్రేషు సంస్థితః
నాగ ఊర్ధ్వగతో వాయుః కూర్మస్తీర్థాని సంస్థితః.

72. కృకరః క్షుభితే చైవ దేవదత్తో విజృంభణే,
ధనంజయో నాదఘోషే నివిశేచ్చైవ శామ్యతి.

73. ఏష వాయు ర్నిరాలంబో యోగినాం యోగసమ్మతః
నవద్వారంచ ప్రత్యక్షం దశమం మన ఉచ్యతే.

ఈశ్వరుడు చెబుతున్నాడు - ప్రాణ వాయువు హృదయంలోను, అపాన వాయువు గుహ్యప్రదేశంలోను, సమాన వాయువు నాభి ప్రదేశంలోను, ఉదాన వాయువు కంఠస్థానంలోనూ ఉంటాయి. వ్యాన వాయువు శరీరమంతటా ఉంటుంది. నాగ వాయువు పైస్థానంలో ఉంటుంది. కూర్మ వాయువు తీర్థాల్లో ఉంటుంది (కనురెప్పల వార్థించేది); కృకర వాయువు క్షోభస్థమయినది (తుమ్ము తెప్పించేది). దేవదత వాయువు ఆవులింతలో ఉండేది. ధనంజయ వాయువు నాదఘోషంలోకి ప్రవేశించి ప్రశాంతమవుతుంది (ప్రసవసమయంలో శిశువును బయటికి నెట్టేది) ఈ పది వాయువులూ అలంబంలనివి యోగంలో సమ్మతమయినవి. పది ద్వారాల్లోనూ తొమ్మిది ద్వారాలు కంటికి కనిపించేవి. పదో ద్వారం మనస్సు.

దేవ్యువాచ

74. నాడీభేదం చ మే బ్రూహి సర్వగాత్రేషు సంస్థితమ్
శక్తిః కుండలినీ చైవ ప్రసూతా దశనాడికాః.

దేవి అడుగుతోంది - శరీరమంతటా ఉండే నాడుల్లో రకాల గురించి చెప్పండి. కుండలినీశక్తిని గురించి, దాన్నించి వెలువడే పది నాడులను గురించి కూడా చెప్పండి.

ఈశ్వర ఉవాచ

75. ఇడా చ పింగళా చైవ సుషుమ్నా చోర్ధ్వగామినీ
గాంధారీ హస్తిజిహ్వా చ ప్రసరా గమనాయుతా.

76. అలంబుషా యశా చైవ దక్షిణాంగే చ సంస్థితాః,
కుహూశ్చ శంఖినీ చైవ వామాంగే చ వ్యవస్థితాః.

77. ఏతాసు దశనాడీషు నానా నాడీ ప్రసూతికా,
ద్విసప్తతి సహస్రాణి శరీరే నాడికాః స్మృతాః.

78. ఏతా యో విందతే యోగీ స యోగీ యోగలక్షణః,
జ్ఞాననాడీ భవేద్దేవి యోగినాం సిద్ధిదాయినీ.

ఈశ్వరుదంటున్నాడు - శరీరంలో ఉన్న ఇడా, పింగళా, సుషుమ్నానాడులు కిందినుంచి పైకి వెళ్ళేవి. గాంధారి, హస్తిజిహ్వా, ప్రసర అనే నాడులు మూడూ దేహమంతటా వ్యాపించి ఉంటాయి. అలంబుష, యశస్వినీ నాడులు కుడివైపు, కుహూ, శంఖినీనాడులు ఎడమ వైపు ఉంటాయి. శరీరంలో మొత్తం 72,000 నాడులు ఉంటాయి; ఈ పది నాడులనుంచి పుడతాయి. ఇది తెలుసుకొన్న యోగులే యోగవిదులు. జ్ఞాననాడి యోగులకు సిద్ధి కలిగిస్తుంది.

దేవ్యువాచ

79. భూతనాథ మహాదేవ బ్రూహి మే పరమేశ్వర,
త్రయో దేవా: కథం దేవ త్రయో భావా స్త్రయో గుణా:

దేవి అడిగింది - ఓ భూతనాథా! మహాదేవా! పరమేశ్వరా! ముగ్గురు దేవతలూ ఎలా ఎలా ఉంటారు? మూడు రకాల భావాలూ మూడు రకాల గుణాలూ ఎలా ఉంటాయి? నాకు వివరంగా చెప్పండి.

ఈశ్వర ఉవాచ

80. రజోభావస్థితో బ్రహ్మ సత్త్వభావస్థితో హరి:,
క్రోధభావస్థితో రుద్ర స్త్రయో దేవా స్త్రయో గుణా:.

81. ఏకమూర్తి స్త్రయో దేవా: బ్రహ్మవిష్ణుమహేశ్వరా:,
నానా భావం మనో యస్య-యస్య ముక్తి ర్న జాయతే.

82. వీర్యరూపీ భవేద్ బ్రహ్మ వాయురూపస్థితో హరి:,
మనోరూపస్థితో రుద్ర స్త్రయో దేవా స్త్రయో గుణా:.

83. దయాభావస్థితో బ్రహ్మ శుద్ధభావస్థితో హరి:,
అగ్నిభావస్థితో రుద్ర స్త్రయో దేవా స్త్రయో గుణా:.

ఈశ్వరుడు ఇలా చెప్పాడు - రజోభావంలో ఉన్నవాడు బ్రహ్మ. సత్త్వభావంలో ఉన్నవాడు విష్ణువు. క్రోధభావంలో ఉన్నవాడు రుద్రుడు. రజోగుణం, సత్త్వగుణం, క్రోధగుణం ఈ ముగ్గురివీ మూడు రకాల గుణాలు (80). బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ముగ్గురూ ఒక్కరే (ఏకమూర్తి). వీరిని వేరు వేరు దేవతలుగా తలచేవాడు ముక్తి పొందలేడు (81). బ్రహ్మ

వీర్యరూపుడు. విష్ణువు వాయురూపుడు. రుద్రుడు మనోరూపుడు. ఆ రూపాల్లో వాళ్ళు తెలుస్తారు (82). దయాభావంలో ఉండేవాడు బ్రహ్మ. శుద్ధభావంలో ఉండేవాడు విష్ణువు. అగ్నిభావంలో ఉండేవాడు రుద్రుడు. ఈ మూడు గుణాలూ ఆ ముగ్గురు దేవతల గుణాలు (శరీరంలో ముగ్గురు దేవతలూ మూడు ప్రకారాలుగా ఉండటంవల్ల గుణాలు మూడు రకాలుగా వ్యక్తమవుతున్నాయి) (83).

84. ఏకం భూతం పరంబ్రహ్మ జగత్ సర్వం చరాచరమ్,
నానా భావం మనో యస్య తస్య ముక్తి ర్న జాయతే ఒడు దేవతా

చరాచర జగత్తంతా ఒకే ఒక పరబ్రహ్మవల్ల పుట్టింది. ఈ విషయంలో నానా రకాల భావాలు మనస్సులో కలిగేవాడికి మోక్షం కలగదు (అంటే, ఏకాత్మభావంతోనే ముక్తి వస్తుంది).

85. అహం సృష్టి రహం కాలో హ్యహం బ్రహ్మా హ్యహం హరిః
అహం రుద్రో హ్యహం శూన్యమహం వ్యాపీ నిరంజనమ్

86. అహం సర్వాత్మకో దేవి నిష్కామో గగనోపమః
స్వభావ నిర్మలం శాంతం సదైవాహం న సంశయః

ఓ దేవీ! నేనే సృష్టి. నేనే కాలం. నేనే బ్రహ్మను. నేను విష్ణువు. నేను రుద్రుణ్ణి. నేను శూన్యాన్ని. నేను అంతటా వ్యాపించి ఉన్నవాణ్ణి. నిరంజనుణ్ణి (85). నేనే సర్వాత్మకుణ్ణి. కోరికలేనివాణ్ణి. ఆకాశంలాటి స్వభావరీత్యా నేను నిర్మలుణ్ణి. నేను ఎప్పుడూ ఉండేవాణ్ణి. ఇది నిశ్చితం (86).

87 జితేంద్రియో భవేచ్ఛూరో బ్రహ్మచారీ మనవరుధితః
సత్యవాదీ భవేద్ భక్తో దాతా ధీరో హితే రతః

ఇంద్రియాలను జయించినవాడు, వీరుడు, బ్రహ్మచర్యాన్ని పాటించేవాడు, బాగా చదువుకొన్నవాడు, ఎప్పుడూ నిజమే చెప్పేవాడు, దాత, ధైర్యంగలవాడు, అందరికీ మేలు చేసేవాడూ మాత్రమే భక్తుడు.

88. బ్రహ్మచర్యం తపోమూలం ధర్మమూలం దయా స్మృతా
తస్మాత్ సర్వప్రయత్నేన దయాధర్మం సమాశ్రయేత్ ౨౮

బ్రహ్మచర్యం తపస్సుకు మూలం. దయ ధర్మానికి మూలం. అందువల్ల సర్వప్రయత్నాలతో దయాధర్మాన్ని పాటించాలి

దేవ్యువాచ

89. యోగేశ్వర జగన్నాథ ఉమాయాః ప్రాణవల్లభ,
వేద సంధ్యా తపో ధ్యానం హోమకర్మ కులం కథం

దేవి అన్నది - ఓ యోగెశ్వర! జగన్నాథ! ఉమాదెవికి ప్రాణప్రియుడా! ఇప్పుడిక వేదం సంధ్య తపస్సు, ధ్యానం, అగ్నికార్యం, కులం ఎలాటివో చెప్పండి.

ఈశ్వర ఉవాచ

90. అశ్వమేధ సహస్రాణి వాజపెయ శతాని చ,
బ్రహ్మజ్ఞానం సమం పుణ్యం కలాం నార్హంతి షోడశీమ్

ఈశ్వరుడు అన్నాడు - కొన్ని వేల అశ్వమేధ యాగాలు, కొన్ని వందల వాజపేయ యాగాలు చేసినందువల కలిగే పుణ్యం బ్రహ్మజ్ఞానం వల్ల కలిగే పుణ్యంలో విసమంత (పదహారో వంతు) కూడా కాదు.

91. సర్వదా సర్వ తీర్థేషు తత్ఫలం లభతే శుచిః,
బ్రహ్మజ్ఞానం సమం పుణ్యం కలాం నార్హంతి షోడశీమ్.

ఎల్లప్పుడూ అన్ని తీర్థాల్లోనూ స్నానంచేస్తూ ఉన్నందువల్ల కలిగే పుణ్యం బ్రహ్మజ్ఞానంవల్ల కలిగే పుణ్యంలో వీసమంత కూడా కాదు.

92. న మిత్రం న చ పుత్రాశ్చ న పితా న చ బాంధవాః,
న స్వామీ చ గురోస్తుల్యం యద్దృష్టం పరమం పదమ్.

పరమపద ప్రాప్తి కలిగిన గురువుకు సమానుడయిన మిత్రుడు లేడు, కొడుకులు లేరు, తండ్రి లేడు, చుట్టాలు లేరు, యజమానుడు లేడు.

93. న చ విద్యా గురోస్తుల్యం న తీర్థం న చ దేవతాః,
గురోస్తుల్యం న వై కోఽపి యద్దృష్టం పరమంపదమ్.

పరమపద ప్రాప్తి కలిగిన గురువుకు సమానంగా ఏ విద్యా లేదు, తీర్థం లేదు, దేవతలు లేరు.

94. ఏకమప్యక్షరం యత్తు గురుః శిష్యే నివేదయేత్,
పృథివ్యాం నాస్తి తద్ద్రవ్యం యద్దత్వా చా నృణీ భవేత్.

శిష్యుడికి గురువు ఒక్క అక్షరమ్మొక్క ఉపదేశించినప్పటికీ (అయన ఋణం తీర్చి) శిష్యుణ్ణి ఋణవిముక్తుణ్ణి చేసే ద్రవ్యం పృథివిలో లేనే లేదు.

95. యస్య కస్య న దాతవ్యం బ్రహ్మజ్ఞానం సుగోపితమ్,
యస్య కస్యాపి భక్తస్య సద్గురుస్తస్య దీయతే.

బ్రహ్మజ్ఞానం చాలా గోప్యంగా ఉంచదగినది. కాబట్టి ఎవరికి పడితే వారికి (శ్రద్ధాభక్తులు లేనివారికి) ఇచ్చేన్తూ పోగూడదు. భక్తునికి మాత్రమే సద్గురువు ఉపదేశం చెయ్యాలి.

96. మంత్ర పూజా తపో ధ్యానం హోమం జప్యం బలిక్రియామ్,
సన్న్యాసం సర్వకర్మాణి లౌకికాని త్యజేద్ బుధః

(బ్రహ్మవిద్యానిష్ఠకు భంగం కలిగించే) మంత్రాన్ని, పూజను, తపస్సును, ధ్యానాన్ని, హోమాన్ని, జపాన్ని, బలికర్మను, సన్న్యాసాన్ని, లౌకికమయిన అన్ని పనులనూ బ్రహ్మవేత్త విడిచిపెడతాడు (సాధనభూతాలయిన మంత్రాదులతో అతనికి పనిలేదు).

97. సంసర్గాద్బహవో దోషాః నిస్సంగా ద్బహవో గుణాః
తస్మాత్ సర్వప్రయత్నేన యతిః సంగం పరిత్యజేత్.

సాంగత్యంలో అనేక దోషాలుంటాయి. నిస్సంగంలో అనేక గుణాలుంటాయి. అందుచేత సన్న్యాసి (యోగి) సర్వప్రయత్నాలూ చేసి సాంగత్యాన్ని విడవాలి.

98. అకారః సాత్త్వికో జ్ఞేయ, ఉకారో రాజసః స్మృతః
మకారస్తమసః ప్రోక్త స్త్రిభిః ప్రకృతి రుచ్యతే.

అకారం సత్త్వగుణంతో కూడినది. ఉకారం రజోగుణమయమయినది. మకారం తమోగుణమయం. ఈ మూడూ కలిసినదే ప్రకృతి.

99. అక్షరా ప్రకృతిః ప్రోక్తా, అక్షరః స్వయమీశ్వరః,
ఈశ్వరాన్నిర్గతా సా హి ప్రకృతిర్గుణబంధనీ.

అక్షరమే ప్రకృతి. అక్షరమే ఈశ్వరుడు. ఈశ్వరుడిలోంచి ప్రకృతి బయలుపడుతుంది. ఈ ప్రకృతి (సత్త్వరజస్తమాలనే) గుణాలతో కూడి ఉన్నది.

100. సా మాయా పాలినీశక్తి: సృష్టిసంహారకారిణీ,
అవిద్యా మోహినీ యా సా శబ్దరూపా యశస్వినీ.

సృష్టిస్థితిసంహారాలు చేసేది మాయే. అదే అవిద్య, మోహిని, శబ్ద (వేద) రూప, యశస్వినీదేవి.

101. అకారశ్చైవ ఋగ్వేద ఉకారో యజురుచ్యతే,
మకార: సామవేదస్తు త్రిషు యుక్తోఽప్యథర్వణ:.

అకారం ఋగ్వేదం, ఉకారం యజుర్వేదం అంటారు. మకారం సామవేదం. ఈ మూడూ కలిసి అథర్వణవేదం.

102. ఓంకారస్తు ప్లుతో జ్ఞేయ స్త్రినాద ఇతి సంజ్ఞిత:,
అకారస్తథ భూర్లోక ఉకారో భువ ఉచ్యతే.

103. సవ్యంజన మకారస్తు స్వర్లోకస్తు విధీయతే,
అక్షరై స్త్రిభి రేతైశ్చ భవేదాత్మా వ్యవస్థిత:.

(మూడు మాత్రలు గల) ప్లుతం ఓంకారం. అదే త్రినాదం అంటారు. అకారం భూర్లోకం. ఉకారం భువర్లోకం. అం స్వర్లోకం. శాస్త్రంలో, మూడు అక్షరాల ద్వారా ఆత్మ ప్రకాశిస్తుంది.

104. అకార: పృథివీ జ్ఞేయా పీతవర్ణేన సంయుత:,
అంతరిక్షం ఉకారస్తు విద్యుద్వర్ణ ఇహోచ్యతే.

105. మకారః స్వరితి జ్ఞేయః శుక్లవర్ణేన సంయుతః,
ధ్రువమేకాక్షరం బ్రహ్మ ఓమిత్యేవం వ్యవస్థితమ్.

అకారం భూమి; పీతవర్ణం (పసుప్పచ్చ) గలది. ఉకారం అంతరిక్షం; విద్యుద్వర్ణం గలది. మకారం స్వర్గలోకం; శుక్లవర్ణం (తెలుపు) గలది. ఒకే అక్షరమయిన ఓంకారమే బ్రహ్మం. ఇది నిశ్చయం.

106. స్థిరాసనో భవేన్నిత్యం చింతానిద్రావివర్జితః,
ఆశు స జాయతే యోగీ నాన్యథా శివభాషితమ్.

చింత(ఆలోచన)నూ నిద్రనూ విడిచిపెట్టి నిత్యమూ స్థిరాసనంలో కూర్చున్నట్లయితే త్వరగానే యోగి అవుతాడు. దీంట్లో సందేహం లేదు. ఇది శివుడు చెప్పినది.

107. య ఇదం పఠతే నిత్యం శృణోతి చ దినే దినే
సర్వపాప విశుద్ధాత్మా శివలోకం స గచ్ఛతి.

బ్రహ్మవిద్యకు సంబంధించిన ఉపదేశాన్ని ప్రతి దినమూ వింటూ ఉండేవాడు సమస్త పాపాలనుంచి విముక్తుడయి శివలోక ప్రాప్తి పొందుతాడు.

దేవ్యువాచ

108. స్థూలస్య లక్షణం బ్రూహి కథం మనో విలీయతే,
పరమార్థం చ నిర్వాణం స్థూలసూక్ష్మస్య లక్షణమ్.

దేవి అన్నది – స్థూల, సూక్ష్మ దేహ లక్షణం ఏమిటి? మనస్సు ఎలా లయమవుతుంది? పరమార్థ లక్షణమూ నిర్వాణ లక్షణమూ కూడా చెప్పండి.

శివ ఉవాచ

109. యేన జ్ఞానేన హే దేవి! విద్యతే న చ కిల్బిషం,
పృథివ్యాపస్తథా తేజో వాయురాకాశమేవ చ.

110. స్థూలరూపీ స్థితోzయం చ సూక్ష్మశ్చ అన్యథా స్థితః.

శివుడన్నాడు - ఓ దేవీ! ఏ జ్ఞానంవల్ల పాపం తొలగిపోతుందో అది చెబుతాను విను. భూమి, నీరు, వెలుగు, గాలి, ఆకాశం అన్నవాటివల్ల పుట్టిన దేహం స్థూలం. కాని సూక్ష్మదేహం వేరే విధంగా ఉంటుంది.




జ్ఞానసంకలనీతంత్రం

శ్లోకాల అకారాదిక్రమ సూచిక

పోరంకి దక్షిణామూర్తి
ఇతర అనువాదాలు కొన్ని

1. డిసెంట్ పత్రం: గురజాడ అప్పారావుగారి 'మినిట్ ఆఫ్ డిసెంట్ గ్రాంధిక వ్యావహారిక భాషావివాదానికి సంబంధించినది (1914). ఆంధ్రప్రభ దినప్రతిక (1964)లో ధారావాహికగా వెలువడి పుస్తకరూపంలో వచ్చింది (విశాలాంధ్ర ప్రచురణాలయం, 1968).
2. ఎందరో మహానుభావులు: నేషనల్ హెరాల్డ్ ఆంగ్ల దినపత్రిక సంపాదకులు ఎం. చలపతిరావుగారి 'ఆల్ ఇన్ ఆల్' (వ్యాసభారతి, 1973).
3. బి.ఎం. శ్రీకంఠయ్య: ఎ.ఎన్. మూర్తిరావుగారి మోనోగ్రాఫ్ (సాహిత్య అకాడెమీ, కొత్తఢిల్లీ, 1978).
4. మన వాయుసేన: సి.ఎల్. ప్రొడ్‌పుట్ రచించిన 'అవర్ ఎయిర్ ఫోర్స్' (నేషనల్ బుక్‌టస్ట్,1983).
5. ఒక యోగి ఆత్మకథ: శ్రీ శ్రీ పరమహంస యోగానందగారి 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి' (జయికో పబ్లిషింగ్ హౌస్,1986).
6. పురాణ పురుష యోగిరాజ శ్రీ శ్యామాచరణ లాహిరి: అశోక్‌కుమార్ చట్టోపాధ్యాయగారి గ్రంథం (యోగిరాజ్ పబ్లికేషన్, 1988).
7. దేవుడితో మాట్లాడ్డం ఎలా?: శ్రీ శ్రీ పరమహంస యోగానందగారి 'హౌ యు కెన్ టాక్ విత్ గాడ్ (యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా,1989).
8. ప్రాణమయం జగత్: అశోక్ కుమార్ చట్టోపాధ్యాయగారి వ్యాససంపుటి (యోగిరాజ్ పబ్లికేషన్,1991).



9. అమ్మ అమృతానందమయి జీవితచరిత్ర, భక్తుల అనుభవాలు: స్వామి అమృతస్వరూపానంద రచన (మాతా అమృతానందమయీ మిషన్ ట్రస్ట్,1996).

10. అమృతజ్యోతి (సంసారులకు సలహాలు): మాతా అమృతానందమయి వాక్కులు (మాతా అమృతానందమయి మిషన్ ట్రస్ట్, 1993).

11. శ్రీ అరవిందులు దర్శించిన భారతీయ సంస్కృతి: చారుచంద్ర దత్తగారి 'కల్చర్ ఆఫ ఇండియా యాజ్ ఎన్విసేజ్డ్ బై శ్రీ అరొబిందో' (ది మదర్స్ ఇంటిగ్రల్ స్కూల్, హైదరాబాదు,1999).

12. అథర్వవేదంలో అక్షయ నిధులు: డా॥ ముంజులూరి నరసింహారావుగారితో కలిసి; అధర్వణ వేదంలో ప్రాణసూక్త, పృధివీసూక్తాల మూలమంత్రాలకు అనువాదం, వ్యాఖ్యానం (టాగూర్ పబ్లిషింగ్ హౌస్,2000).

13. నిర్వహణలో మానవత్వపు విలువలు: శ్రీ రామకృష్ణ మిషన్, శ్రీరామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి రంగనాధానందగారి 'హ్యూమన్ వాల్యూస్ ఇన్ మేనేజ్‌మెంట్' (అముద్రితం).

14. భారతీయ జానపద కళలు: చేతిపనులు: 'ఇండియన్ ఫోక్ ఆర్ట్స్ అండ్ హేండీక్రాఫ్ట్స్' (నేషనల్ బుక్ ట్రస్ట్; అముద్రితం).

15. హైదరాబాదు జాతరలు, పండుగలు, ఉత్సవాలు: 'ఫెయిర్స్,ఫెస్టివల్స్ అండ్ సోషల్ ఫంక్షన్స్ ఆఫ హైదరాబాద్ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం; అముద్రితం).

16. ఆంధ్రప్రదేశ్ : ఎ.రమేశ్‌చౌదరి గ్రంథం (నేషనల్ బుక్ టస్ట్; అముద్రితం).

17 మహామహిమాన్వితులు సాయిబాబా ; ఆర్థర్ ఆస్బర్న్ రాసిన 'ద ఇన్‌క్రెడిబుల్ సాయిబాబా'కు అనువాదం, ఓరియంట్ లాంగ్మన్, 1996

18 సద్గురు నిగమానంద (ఒక యోగి ఆత్మకథ) (హిందీ నుంచి)

19 సఫలతా నియమం : పరమహంస యోగానందగారి 'ద లా ఆఫ్ సక్సెస్'కి అనువాదం, 2003

20. ఉపదేశామృతం-II : మాతా అమృతానందమయి



శ్రీరామ్ గారు　　శివరామకృష్ణగారు